www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 19 ఆగస్టు 2024
5
ఏలూరు

ముదినేపల్లిలో రాఖీల సందడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో రాఖీల సందడి నెలకొంది. సోమవారం రాఖీ పండుగ కావడంతో రాఖీ విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. పిల్లలు, యువకులు, యువతులు పెద్ద ఎత్తున రాఖీలు కొనుగోలు చేస్తున్నారు. రాఖీలు కొనుగోలు చేసే యువతి, యువకులతో దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రాఖీలు కొనుగోలు చేసేందుకు వచ్చే వారితో రాఖీ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి ఒక్కో రాఖీ ధర రూ.10 నుంచి రూ.300 వరకు ధర ఉన్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ముదినేపల్లిలోనే 20 వరకు రాఖీ దుకాణాలు వెలిశాయి. దీంతో పిల్లలు, పెద్దలు, యువతీ యువకులు రాఖీలు కొనుగోలు చేసేందుకు దుకాణాలకు క్యూ కడుతున్నారు. దీంతో ముదినేపల్లి సెంటర్‌లో సందడి వాతావరణం నెలకొంది.

ఇసుక కష్టం.. తీరేదెన్నడు..!

- ఇసుక దొరక్క నిలిచిన నిర్మాణ పనులు
- రెండు జిల్లాల్లో రెండు లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల అవస్థలు
- కాగితాలకే పరిమితమైన స్టాక్‌పాయింట్లు
- అలంకార ప్రాయంగా చేబ్రోలు స్టాక్‌పాయింట్
- 20 టన్నుల ఇసుక బ్లాక్‌లో రూ.26 వేలు
- ఏ ప్రభుత్వం వచ్చినా మార్పు శూన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా ఇసుక కష్టాలు మాత్రం ప్రజలను వీడడం లేదు. ఉచిత ఇసుక అంటూ గొప్పలు చెబుతూ అసలు ఇసుకే అందకుండా చేసిన పరిస్థితి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో నెలకొంది. దీంతో ఇసుక కష్టాలు తీరేదెన్నడు అంటూ జనాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఇసుక కొరతతో నిర్మాణ పనులు నిలిచిపోవడంతో భవననిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. ఏలూరు జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. స్టాక్‌పాయింట్లలో ఇసుక లెక్కలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రజలకు మాత్రం ఇసుక అందుబాటులో లేకుండాపోయింది. చేబ్రోలు ఇసుక పాయింట్ ఎందుకు ఉందో కూడా ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలేకుండా అలంకారప్రాయంగా మాత్రమే మిగిలింది. కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేట ఇసుక పాయింట్ల వల్ల జనాలకు ఏమాత్రమూ ఉపయోగం లేకుండాపోయింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక స్టాక్‌పాయింట్లు సైతం లేకుండా పోయాయి. తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న స్టాక్‌పాయింట్ల వద్దకు వెళ్లినా ఇసుక దొరకడం లేదు. లారీలు కిలోమీటర్ల మేర బారులు తీరి ఉంటున్నాయి. రెండు, మూడు రోజులు వేచిచూసినా ఇసుక దొరకడం కష్టంగా మారింది. ఒకవేళ ఇసుక దొరికినా లారీ యజమానులు వెయిటింగ్ ఛార్జీలు వసూలుచేయడంతో తడిసి మోపెడవుతోంది. బ్లాక్ మార్కెట్లో 20 టన్నుల ఇసుక రూ.26 వేలు వసూలు చేస్తున్నారు. అదికూడా ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఉచిత ఇసుక అంటే ఇదేనా అంటూ జనం నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక సమస్యపై అధికారులు చేస్తున్న ప్రకటనలకు వాస్తవ పరిస్థితికి సంబంధం లేకుండా పోయింది.

రెండు లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల అవస్థలు..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 32 పనులకు సంబంధించి దాదాపు రెండు లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. ఇసుక కొరతతో నిర్మాణ పనులు ఆగిపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు కావడంతో పనుల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాపీ పనివారు, రంగులు వేసేవారు, సెంట్రింగ్, వడ్రంగి పనివారు ఇలా నిర్మాణ రంగంతో ముడిపడి ఉన్న అనేక మందికి పనులు లేకుండా పోయాయి. గత ప్రభుత్వంలో ఇసుక కొరత తీవ్రతతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం మారినా అదే పరిస్థితి కొనసాగుతుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం వెంటనే ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. అధికారులు మాత్రం స్టాక్ పాయింట్లలో ఇసుక లెక్కలు చెబుతూ మభ్యపెట్టే పనులు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇసుక లేక నిర్మాణ పనులు ఆగిపోయాయి

గోకా సూరిబాబు, తాపీమేస్త్రీ, బువ్వనపల్లి

నా దగ్గర దాదాపు వంద మంది వరకూ పనిచేస్తారు. ఇసుక దొరక్క నిర్మాణ పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పనుల్లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిన్నటి వరకూ వరద అన్నారు. వరద తగ్గాక కూడా ఇసుక దొరకడం లేదు. రెండున్నర యూనిట్ల ఇసుక బ్లాక్ రూ.12 వేలకు అమ్ముతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇసుక సమస్య మాత్రం తీరడం లేదు. ఇసుక అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పనిలేక కార్మికులు ఇంటి దగ్గర ఉంటున్నారు

చిన్న, తాపీ మేస్త్రీ, నిడమర్రు మండలం

నా వద్ద 25 మంది వరకూ పనిచేస్తారు. ఇసుక లేక పనులు ఆగిపోయాయి. నాలుగైదురోజులుగా పూర్తిగా పనులు ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 20 టన్నుల ఇసుక రూ.26 వేలు చెబుతున్నారు. స్టాక్‌పాయింట్ల వద్ద రోజుల తరబడి వేచిచూడాల్సి రావడంతో వెయిటింగ్ ఛార్జీలు వేయడంతో భారీగా ఖర్చవుతోంది. భవన యాజమానులు ఇసుక పేరు చెబితే హడలిపోతున్నారు. ఇసుక అందుబాటులోకి తీసుకు వస్తే పనులు ఉంటాయి. లేకపోతే పనిచేసే వారు తీవ్ర ఇ బ్బందులు పడాల్సివస్తోంది.

కమ్యూనిటీ హాలు నిర్మించాలని నిరసన

నిరసన తెలుపుతున్న దళితులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం రాజీవ్ నగర్ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ స్థానిక దళితులు నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ పాల్గొని మాట్లాడుతూ బుట్టాయగూడెం రాజీవ్‌నగర్ కాలనీ నిర్మించి 40 ఏళ్లు కావాస్తున్నా ఇప్పటివరకు ఊరు మధ్యలో కమ్యూనిటీ హాలు నిర్మించలేదన్నారు. రాజీవ్ నగర్ కాలనీ మధ్యలో 12 సెంట్లు భూమి ఉందని, ఈ భూమిలో ఎవరైనా పెళ్లిళ్లు, ఫంక్షన్లు చేసుకోవడానికి ఫంక్షన్ హాలు లేదా కమ్యూనిటీ హాలు నిర్మించాలని నాయకులను కోరుతున్నామన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిసారి నిర్మిస్తామని హామీలు ఇవ్వడమే తప్ప ఇప్పటివరకు నాయకులు ఆ మేరకు చర్యలు తీసుకోలేదని, కమ్యూనిటీ హాలు నిర్మించలేదని చెప్పారు. 2024లో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరారు. దళిత కుటుంబాలు ఏదైనా శుభకార్యం చేసుకోవాలంటే స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ 12 సెంట్లు భూమిలో కమ్యూనిటీ హాలు లేదా ఫంక్షన్ హాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఏర్పడిందని చెప్పారు. నూతన కమిటీగా గంజి రాజేష్, గుల్ల సురేష్, బంటుమిల్లి మంగా మంగమూరి, బేబి, ఎం.వెంకటేశ్వరరావు, పి.సూరయ్య, జి.సునీత, టి.ఇందిరా, పి.మందాకిని, బి.బాలు కమిటీ పెద్దలుగా ఏర్పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు వై.రాజు పాల్గొన్నారు.

పాతబస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, ప్రజా సంఘాల నేతలు

వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని ఖండిస్తూ..

కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోల్‌కత్తా వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను ఖండిస్తూ స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యంత కిరాతకంగా అత్యాచారం చేయడమేగాక హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ముద్దాయిలకు రక్షణ కల్పించి ఈ ఘటనను తప్పుదోవ పట్టించే విధంగా చేయడాన్ని ఐద్వా, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. 36 గంటలపాటు డ్యూటీ చేసే విద్యార్థినులకు రెస్ట్ రూమ్ కూడా లేకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులు కూడా వత్తాసు పలుకుతూ విద్యార్థిని తల్లిదండ్రులకు ఆత్మహత్య చేసుకుందని చెప్పడంలో ఈ కేసులో దోషులను పోలీసులే కాపాడేందుకు చూస్తున్నారని అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా ఆ క్రూరమృగాళ్లను వెంటనే శిక్షించాలని ఐద్వా, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు దుర్గ, భవాని, స్పందన, వ్యవసాయ కార్మిక సంఘం, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎ.రవి, పి.రామకృష్ణ, పి.కిషోర్, కె.శ్రీనివాస్, పూర్వ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పివి.నరసింహారావు, లెనిన్, ఠాగూర్, దుర్గాప్రసాద్, కె.రామాంజనేయులు, బి.జగన్నాథం పాల్గొన్నారు.

కుక్కునూరు : వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ తెలిపారు. ఆదివారం సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయం నుంచి సిఐటియు మండల కమిటీ ప్రకటన విడుదల చేసింది. కలకత్తా వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరిగి 10 రోజులు గడుస్తున్నా ఇంకా ఆమెకు న్యాయం జరగకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మహిళలకు ఇంటా, బయటా రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని సాయికిరణ్ డిమాండ్ చేశారు.

ఏలూరు అర్బన్ : కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా మహిళల కోసం ప్రత్యేక చట్టాలు కచ్చితంగా తీసుకురావాలని తెలిపారు. ఇలాంటి విషయాల్లో పోలీసు వ్యవస్థ కూడా ప్రకడ్బందీగా పనిచేయాలని, అప్పుడే ఇటువంటి ఘోరాలు పునరావృతం కాబోవని తెలిపారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, మహిళా విభాగం సభ్యులు కె. నాగమణి, డి.నాగ దేవి,టి. కుసుమ కుమారి, కె.సునీత హత్యాచార సంఘటనను ఖండిస్తున్నట్లు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో మహిళపై అత్యాచార యత్నం ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం సిపిఎం నాయకులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ పనులు లేక ఒక కుటుంబం గత కొద్ది రోజులుగా ఏలూరు వచ్చి రోజు వారీ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. రాత్రి సమయంలో మద్యం మత్తులో ముగ్గురు యువకులు బాధితురాలి భర్తపై దాడి చేసి ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డారని అన్నారు. ఈ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో రోజురోజుకూ మహిళలపై ఇటువంటి అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కొత్త కొత్త చట్టాలు చేశామని గొప్పలు చెబుతున్నా మహిళలపై ఇటువంటి దాడులను ఆపలేకపోవడం సిగ్గు చేటన్నారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఒక వ్యక్తి ముందుగా 100 నంబర్‌కు ఫోన్‌చేస్తే అది పనిచేయక పోవడం, దాని తర్వాత ఆ వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం అందించినా వెంటనే పోలీసులు స్పందించ లేదని పత్రికల్లో వచ్చిందని, దానిపై విచారణ చేపట్టాలని కోరారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసినప్పటికీ, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వారికి కఠిన శిక్ష పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 100 పనిచేయక పోవడం, పోలీసుల నిర్లక్ష్యం వార్తలపై హోంశాఖ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బాధితురాలి కుటుంబానికి ఉపాధి చూపించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, వివివిఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయంలో

ఫైల్స్ దగ్ధం ఘటనపై విచారణ చేపట్టాలి

నిందితులను కఠినంగా శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం ప్రాజెక్ట్ పరిపాలన కార్యాలయంలో ఫైల్స్ దహనం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, పోలవరం ప్రాజెక్టు భూముల సేకరణ, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ పంపిణీలోను జరిగిన అవకతవకలను బయటపెట్టాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో ఫైల్స్ దగ్ధం అవుతున్నాయనే వార్తలు తరచుగా వినిపిస్తున్నాయని, మొన్న మదనపల్లి ఆఫీసులోనూ, నిన్న కొవ్వూరు ఎస్‌టిసి కార్యాలయంలోనూ, ఈరోజు తిరుమల తిరుపతి దేవస్థానం ఆఫీసులో ఫైల్స్ దగ్ధమైనట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఈ వార్తలను పరిశీలిస్తుంటే ఇది కావాలనే, ఇంతకుముందు జరిగిన అవకతవకలు, అవినీతి ఆరోపణలు బయటపడకుండా ఉండేందుకే ఈ రకమైన చర్యలకు పాల్పడుతున్నట్లు అర్థమవుతుందన్నారు. ఇది కేవలం గతంలో అధికారంలో ఉన్న వారి పాత్రే కాకుండా ఆ కార్యాలయాల్లో ఉన్న కొంతమంది అధికారులు, సిబ్బందికి కూడా ఈ అవినీతిలో భాగస్వామ్యం ఉండడంతోనే ఇప్పుడు ప్రభుత్వం మారినా ఈ ఫైల్స్ దగ్ధం కార్యక్రమం సాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రత్యేకించి పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితులకు అక్కడ కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన పరిహారం విషయంలో కూడా చాలా అవకతవకలు జరిగాయని సిపిఎం గతంలోనే ఆందోళనలు చేసిన, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన, పోరాటాలు చేసిన సందర్భాలు ఉన్నాయన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దాదాపు ఆ ప్రాంతాల్లో రూ.500 కోట్లకు పైగా అవినీతి జరిగిందన్నారు. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో భూమిని కొనుగోలు చేసిన సందర్భంలో గిరిజనులకు సంబంధించిన సాగులో ఉన్న భూముల్ని గిరిజనేతర భూస్వాముల పేరుతో రికార్డులు తారుమారు చేసి కొనుగోలు చేశారని తెలిపారు. గిరిజనుల పొట్ట కొట్టి గిరిజనేతర భూస్వాములతో కొంతమంది అధికారులు, ప్రజా ప్రతినిధులు, అప్పటి అధికార పార్టీకి చెందిన నాయకులు కుమ్మక్కై దళారులుగా మారి కోట్ల రూపాయలు స్వాహా చేశారని ఆరోపించారు. భూమికి భూమి ఇచ్చే విషయంలో, నిర్వాసితుల వద్ద భూమి కొనుగోలు చేసే విషయంలో కూడా తప్పుడు రికార్డులతో ఇవ్వాల్సినంత ఇవ్వకుండా, చూపించాల్సినంత చూపించకుండా పరిహారం ఇవ్వాలంటే లంచం ఇవ్వాలనే పద్ధతిలో కూడా అవకతవకలు, అవినీతి జరిగాయని గతంలోనే సిపిఎం అధికారుల దృష్టికి తీసుకెళ్లిందన్నారు. వీటన్నింటిపై గత ప్రభుత్వం సీరియస్‌గా విచారణ చేయకపోవడం, నిందితులను గాలికి వదిలేసిన ఫలితంగానే ఈ ఫైల్స్ దగ్ధం కార్యక్రమం యదేచ్ఛగా కొనసాగుతుందన్నారు. కొవ్వూరు ఎస్‌టిసి కార్యాలయంలో ఫైల్స్ దగ్ధంపై సంతకాలు లేని కాగితాలు మాత్రమే సిబ్బంది దగ్ధం చేశారని అధికారి ఒకపక్క చెబుతూ, మరోపక్క ఫైల్స్ దగ్ధం చేసేటప్పుడు తన దృష్టికి తీసుకురాలేదని చెప్పడంలోనే అక్కడ ఏదో జరిగిందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఈ విషయాలపై సమగ్ర విచారణ జరిపించాలని, గత ప్రభుత్వంలా వ్యవహరించకుండా ఫైల్స్ దగ్ధం మీద, పోలవరం ప్రాజెక్టు భూముల విషయంలో సమగ్ర విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని, నిర్వాసితులకు, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ప్రభుత్వానికి కూడా ఈ అవకతవకల్లో భాగస్వామ్యం ఉందని భావించాల్సి వస్తుందని, ఈ ఘటనలపై ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి

రెండో పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన వైవి.రమణ

ప్రజాశక్తి ఏలూరు స్పోర్ట్స్

సిఐగా బాధ్యతలు చేపడుతున్న రమణ

రెండో పట్టణ పరిధిలో శాంతిభద్రతలు కాపాడేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని రెండో పట్టణ సిఐ వైవి.రమణ తెలిపారు. రెండో పట్టణ సిఐగా ఆయన ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వైవి.రమణ 1996 ఎస్ఐ బ్యాచ్‌కు చెందినవారు. 2010లో ఆయన సిఐగా ఉద్యోగోన్నతి పొందారు. సిఐగా ఉద్యోగోన్నతి పొందిన తర్వాత మొట్టమొదటిగా ఏలూరు ట్రాఫిక్ సిఐగా పని చేశారు. అనంతరం హనుమాన్ జంక్షన్ సిఐగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఇంటెలిజెంట్ సిఐగా ఏలూరులో పనిచేశారు. అనంతరం సిఐడి రాజమండ్రి సిఐగా పని చేశారు. ప్రస్తుతం బందరు ట్రాఫిక్ సిఐగా పనిచేస్తుండగా సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఏలూరు నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐగా బదిలీ అయ్యారు. ఆదివారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని చెప్పారు. సిఐను రెండో పట్టణ ఎస్ఐలు మదీన బాష, సాదిక్, రవితేజ, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిఐ రమణ ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీరామ్మూర్తి మృతి తీరని లోటు

సిపిఎం జిల్లా కేంద్రం శాఖ కార్యదర్శి ఆదిశేషు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం సీనియర్ నాయకులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకులు వలవల శ్రీ రామ్మూర్తి (90) మృతి పార్టీ, ఉపాధ్యాయ, రైతు సంఘం, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కేంద్రం శాఖ కార్యదర్శి పి.ఆదిశేషు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామ్మూర్తి మృతికి జోహార్లు అర్పించారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. 25 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తి పూర్తి చేసుకుని మిగిలిన కాలాన్ని ప్రజాతంత్ర ఉద్యమానికి అంకితం చేశారని తెలిపారు. అలాగే సిపిఎం సీనియర్ నాయకులు ఎలినేని దుర్గారావు మృతి పార్టీకి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటన్నారు. వారి ఆశయ సాధన కోసం పనిచేయటమే వారికి నిజమైన నివాళులని తెలిపారు.

అన్నిదానాల్లోకి విద్యాదానం గొప్పది

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసిన ఎంఎల్ఎ చంటి

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పదని ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు తూర్పుకాపు విద్య, విజ్ఞాన, అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏలూరులోని సంఘం భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తుమరాడ సూర్యనారాయణ శాశ్వత విద్య నిధి పథకం కింద 150 మంది మెరిట్ విద్యార్థులకు మూడు లక్షల రూపాయలు విలువైన స్కాలర్ షిప్‌లను ఎంఎల్ఎ బడేటి చంటి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షులు లంకా వెంకట రామ్మోహన్‌రావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ బడేటి చంటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తూ ఉన్నత విద్యావ్యాప్తికి కృషిచేస్తున్న తూర్పుకాపు సంఘం సేవలు అభినందనీయమన్నారు. విద్యాదానం ఎంతో గొప్పదన్నారు. విద్యావంతులు ఎక్కడ ఉన్నా ఉన్నత స్థితిలో ఉంటారని తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ బడేటి చంటిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు సంఘం ఉమ్మడి జిల్లాలఅధ్యక్షులు ఎస్.రామారావు, ఏలూరు తూర్పు కాపు విద్య, విజ్ఞాన, అభివృద్ధి సంఘం కార్యదర్శి అలజంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతుల అవస్థలు

బ్లాక్‌లో జోరుగా యూరియా, కాంప్లెక్స్ విక్రయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో యూరియా కొరత రైతులను వేధిస్తుంది. యూరియా కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని ఆర్‌బికెల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు నిల్వ లేకపోవడంతో రైతులు ప్రయివేట్ దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఆర్‌బికెలకు ఎరువులను సరఫరా చేయలేదు. ఆర్‌బికెల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు లేకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టారాజ్యాంగా ఎరువులను అధిక ధరలకు విక్రమిస్తూ రైతులను దోపిడి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎరువులు ఆర్‌బికెలకు సరఫరా చేయకపోవడంతో ఇక చేసేది లేక ప్రయివేట్ ఎరువుల దుకాణాదారులు చెప్పిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. యూరియా 45 కేజీలు ఎంఆర్‌పి రూ.266 ఉండగా, రూ.300లకు, అలాగే డిఎపి (కాంప్లెక్స్) 50 కేజీలు ధర రూ.350 ఉండగా రూ.400కు విక్రయిస్తూ వ్యాపారులు కౌలు రైతులను నిలువు దోపిడి చేస్తున్నారు. దీంతో ఒక్కో కట్టకు రూ.50 అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు చేసేదిలేక అధిక ధరలకు ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. అంతేకాక వ్యాపారులు లింకులు పెడుతున్నారు. యూరియా కావాలంటే కాంప్లెక్స్ కొనాల్సిందే, లేకుంటే యూరియా కట్ట ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. దీంతో యూరియా కావాల్సిన రైతులు కాంప్లెక్స్ అవసరం లేకపోయినా దానిని కూడా కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఈ రీతిగా యూరియా కొరతను ఆసరా చేసుకొని రైతులను వ్యాపారులు ముప్పతిప్పలు పెడుతున్నారు. యూరియా కావాలంటే డిఎపి కొనాల్సిందేనంటూ వ్యాపారులు చెప్పడంతో చేసేదిలేక డిఎపి అవసరం లేకున్నా కొనాల్సి వస్తుందంటూ రైతన్నలు చేస్తున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి వెంటనే ఆర్‌బికెలకు ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలంటూ కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే ఇష్టారాజ్యంగా, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మండల రైతాంగం కోరుతుంది.

ఒక పక్క ఎండ.. మరో పక్క ఉక్కబోత

జనం విలవిల

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - కలిదిండి

ఉక్కపోత ఎండవేడిమితో కలిదిండిలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండ తీవ్రత వేసవి కాలాన్ని తలపించిందని జనం అంటున్నారు. ఆదివారంకు తోడు జన సంచారం లేక పోవడంతో ప్రధాన సెంటర్‌లో అత్యధిక షాపులు మూతబడడంతో వెలవెల బోయింది. కొనుగోలు దారులు మిట్ట మధ్యాహ్నం నుంచి ఇంటి బాట పట్టారు. గత కొన్ని రోజులుగా తరచూ వర్షాలు పడుతూ వేసవి తాపాన్ని మరిచినా రెండు రోజులుగా ఎండ వేడిమి వేసవిని తిరిగి గుర్తు చేస్తోందని చెబుతున్నారు. ఎండ వేడిమితో జనం విలవిల్లాడుతున్నారు. ఎండ తీవ్రతతో కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది.

ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చింతలపూడి

ముత్యాలమ్మ తల్లి చెరువు ఆక్రమణలు తొలగించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. 'ఆక్రమణలో ముత్యాలమ్మతల్లి చెరువు..!' శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ముత్యాలమ్మ చెరువును 25 మంది రైతులు ఆక్రమించి మొక్కజొన్న, పామాయిల్ పంటలను సాగు చేస్తున్నారని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిందని అధికారులు తెలిపారు. ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎర్రగుంటపల్లి పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశామని ఆర్‌డిఒ భవానీశంకరి తెలిపారు. ఆక్రమణదారుల వివరాలు, నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, సదరు నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కృష్ణాపురంలో తీజ్ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

తీజ్ ఉత్సవంలో కృష్ణాపురం గ్రామస్తులు

మండలంలోని కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తీజ్ ఉత్సవాలను ఆ సంఘం నాయకులు ఘనంగా ప్రారంభించారు. తొమ్మిది రోజుల ఈ తీజ్ ఉత్సవాల్లో భాగంగా పదిమంది ఆడపిల్లలు భూక్యా హిమజ, జరభల నాగమ్మ, లావుడియా భవాని, కనక మహాలక్ష్మి, దీపిక, నాగభవాని, తనుజ, హర్షితలు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ ఆడపిల్లలు జీవితంలో సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మస్థైర్యంతో ఎదిగేందుకు బంజారాలు తీజ్ పండుగను చేస్తారన్నారు. తొమ్మిది రోజుల పాటు బంజారా ఆడపిల్లలు ధర్మ దీక్ష చేపట్టి తమ పూర్వీకులను స్మరించుకుంటూ ఆట, పాటలతో చాలా ఉత్సాహభరితంగా ఈ తీజ్ పండుగను చేసుకుంటారన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ పంటలు బాగా పండాలని, పశు సంపద బాగా పెరగాలని, గ్రామ నిధి సంపదలతో వెల్లివిరియాలని బంజారాలు తీజ్ పండుగను ప్రతి ఏడాది శ్రావణమాసంలో జరుపుకుంటారని చెప్పారు. తీజ్ ఉత్సవ కమిటీ జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఆడపిల్లలు వెదురు బుట్టల్లో గోధుమ విత్తనాలు చల్లడంతో తీజ్ ఉత్సవం మొదలై తొమ్మిదో రోజు గోధుమ మొలక బుట్టలను ఊరంతా ఊరేగించి చెరువులో నిమజ్జనం చేయడంతో పండగ పూర్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా బిగినాదం, ధరావత్ రవి, జరభల పుల్లయ్య, భద్రయ్య, బంగారు బాబు, సత్తి బాబు, భద్రమ్మ, అరుణ, భాగ్య లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

చేగొండపల్లి యువత శ్రమదానం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని చేగొండపల్లి పునరావాస కాలనీలో స్థానిక అంగన్వాడీ సమీపంలో డ్రెయినేజీ వద్ద అపారిశుధ్య వాతావరణం నెలకొనడంతో ఆదివారం చేగొండపల్లి యువకులు శ్రమదానం చేశారు. డ్రెయినేజీ పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు మాట్లాడుతూ పంచాయతీ డ్రెయినేజీలు పూడిక పట్టి వర్షం నీరు నిలిచి అంగన్వాడీ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీధి లైట్లు వెలగడం లేదని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అందుకే తాము స్వయంగా శ్రమదానం చేసి డ్రెయినేజీ పూడిక తీశామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు వేసి డ్రెయినేజీ పూడిక తీయాలని కోరారు.

నేటి నుంచి సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వి.మంగతాయారు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎంపిడిఒ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని సూరప్పగూడెం గ్రామంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై ఆదివారం ఒక వ్యక్తి మృతి చెందారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరప్పగూడేనికి చెందిన బోను వెంకటరమణ(52) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఉదయం తన ఇంటి ఎదురుగా ఉన్న మురుగు కాలువను శుభ్రపరిచేందుకు అవసరమైన పొడవైన వస్తువు కోసం ఆయన తన ఇంటికి సమీపంలో ఉన్న వేరొక ఇంటి పై అంతస్తుకు వెళ్లి అక్కడ ఉన్న ఇనుపరాడ్డును తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో దానిని తెస్తుండగా ఆ ఇంటికి సమాంతరంగా వెళ్లే విద్యుత్ వైరు లైనుకు ఇనుప రాడ్ తగలడంతో విద్యుదాఘాతానికి గురైన వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన చింతలపూడి మండలంలోని రేచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రేచర్ల గ్రామానికి చెందిన రెబ్బ నాగేంద్రబాబు(26) ఆదివారం పొలంలో దుక్కు దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగేంద్రబాబు మృతి చెందాడు. చింతలపూడి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారు ఆభరణాల బ్యాగ్ బాధితులకు అప్పగింత

ఆధునిక పరిజ్ఞానంతో గంటల వ్యవధిలో పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విలువైన బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగును పోగొట్టుకున్న గంటల వ్యవధిలో ఏలూరు మూడో పట్టణ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గుర్తించి తిరిగి ఫిర్యాదుదారులకు అందించారని డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో జరిగిన ఈ ఘటనపై డిఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం వేములవాడ ప్రాంతానికి చెందిన దంపతులు చిట్టి రామారావు, శివకుమారి ఏలూరు నగరంలోని కొత్తపేట ప్రాంతంలో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు వచ్చారు. వీరు ఆదివారం ఉదయం ఏలూరు నగరానికి చేరుకున్నారు. వీరు 80 గ్రాముల బంగారు ఆభరణాలు బ్యాగ్‌లో తీసుకొచ్చారు. కొత్తపేటలో ఇంటికి చేరుకున్న తర్వాత అక్కడ నుంచి ఫంక్షన్ జరిగే చలసాని గార్డెన్‌కు వెళ్లేందుకు వారు ఆటోను అద్దెకు మాట్లాడుకుని వెళ్లారు. ఫంక్షన్ వద్దకు వెళ్లి చూసుకోగా ఆభరణాలు కలిగిన బ్యాగ్ కనిపించడం లేదని వారి గుర్తించారు. వెంటనే మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మూడో పట్టణ ఎస్ఐ-1 ప్రసాద్ కేసు నమోదు చేశారు. మూడో పట్టణ ఎస్ఐ-2 అజయ్ కుమార్ ఆధునిక పరిజ్ఞానంతో ఆటో వివరాలను సేకరించారు. ఆదివారం రాత్రి హెడ్ కానిస్టేబుల్ విజయరాజు ఆటోను గుర్తించి అతని వద్ద ఉన్న బ్యాగును మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ బ్యాగ్‌ను డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోగొట్టుకున్న వారికి తిరిగి అందించారు. వారు బ్యాగును ఆటోలో మరిచిపోయిన సంగతి ఆటో డ్రైవర్ కూడా గుర్తించలేదు. విలువైన బ్యాగును పోగొట్టుకున్న గంటల వ్యవధిలో తిరిగి పోగొట్టుకున్న వారికి అప్పగించిన మూడో పట్టణ పోలీసులను డిఎస్‌పి అభినందించారు. మూడో పట్టణ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ విజయరాజులు ఈ కేసును ఛేదించడంతో వారికి రివార్డులను ప్రకటించారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గోపవరం గ్రామం నాగేంద్రపురం సెంటర్‌లో పేకాట స్థావరంపై ముసునూరు ఎస్ఐ పి.వాసు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.14,400 నగదు, రూ.52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వీధి కుక్కల స్వైర విహారం

ప్రజలు, విద్యార్థులపై దాడులు

అధికారులు స్పందించాలని కుక్కునూరు వాసుల వేడుకోలు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు గ్రామంలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైరవిహారం చేస్తూ చిన్నా పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోడ్లమీద ప్రయాణించాలంటేనే ప్రజలు భయాబ్రాంతులకు గురవుతున్నారు. ఇళ్లలోకి ప్రవేశించి దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక వార్డులో కుక్కల దాడిలో విద్యార్థి లేదా వృద్ధులు గాయపడ ుతున్నారని, రాత్రి వేళల్లో కుక్కలు కాలనీల్లో గుంపులుగా తిరుగుతూ అరుపులతో హడలెత్తిస్తున్నాయని, అయినప్ప టికీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆయా కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల్లో ఎక్కువగా ప్రభుత్వాసుపత్రిలో కుక్కకాటుకు సంబంధించిన కేసులే ఎక్కువయ్యాయని, కుక్కకాటుతో బాధితులు ఆసుపత్రిలో చేరుతూనే ఉన్నారని తెలిపారు. కుక్కలు పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్ల మీద సంచరిస్తూ దడ పుట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒంట రిగా వెళ్లాలంటే వృద్ధులు భయాందోళనలకు గుర వుతు న్నార న్నారు. విద్యార్థులు బడికి వెళ్లేటప్పుడు ఎవరో ఒకరు తోడుగా వెళ్లాల్సి వస్తోందని, సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడదను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై సంచరిస్తున్న వీధికుక్కలు

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బండివారిగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున రూ.పది వేలు ప్రోత్సాహక నగదు గ్రామానికి చెందిన దాత అందించారు. గ్రామానికి చెందిన దాత నాళం నారాయణ కుమారుడు నాళం భరత్‌కుమార్ తమ పూర్వీకులైన నాళం జగ్గారావు, సూర్య నాగమ్మ దంపతుల కుమారుడైన సీతారామంజనేయులు, బాల భాగ్యవతి దంపతుల జ్ఞాపకార్థం పదిమంది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం డి.బాజా ఆదివారం తెలిపారు. ఆ నగదును విద్యార్థులకు అందించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను విద్యలో ఉన్నతంగా ఎదగాలని ప్రోత్సాహం అందించడం అభినందనీయమని దాతలను మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి అభినందించారని తెలిపారు.

నగదు అందుకుంటున్న విద్యార్థి

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు : ఎంఎల్‌ఎ చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

అర్హులందరికీ మూడు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పేదవాడికి సొంత ఇంటి నిర్మాణం పేరుతో గత వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల కష్టాలను, సమస్యలను ఆలకించిన ఎంఎల్‌ఎ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చింతమనేని మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో గత వైసిపి ప్రభుత్వం పేదవాడిని మోసం చేసిందన్నారు. నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో చేపట్టిన స్థల సేకరణ పేరిట కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించారని, అసంపూర్తిగా పేదవాడి ఇళ్ల నిర్మాణాలు వదిలేసి వైసిపి నాయకులు మాత్రం కోట్ల రూపాయలు డబ్బు అక్రమంగా దోచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేదవాడికి మూడు సెంట్ల నివాస స్థలం ఇచ్చి పేదవాడి సొంత ఇంటి కలను సాకారం చేయటానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), బొప్పన సుధ, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న చింతమనేని

వీరత్వానికి మారుపేరు సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్

జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - కుక్కునూరు

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తామని కుక్కునూరు మండలం గౌడ్ సంఘ నాయకులు కొన్నె లక్ష్మయ్య అన్నారు. పాపన్న గౌడ్ 374 జయంతిని పురస్కరించుకుని పెదరాయిగూడెంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేసి నిజాం నిరంకుశ పాలనకు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడిగా ఖ్యాతి గడించారని, బిసి తరగతులను కలుపుకుని ముందుకు సాగుతూ బహుజన రాజ్య స్థాపనకు పాటు పడ్డారని కొనియాడారు. క్రీం బిడ్జి యూనివర్సిటీ ప్రెస్‌క్లబ్‌లో పాపన్న గౌడ్ ప్రస్థానం గురించి రాసిన ఘనత చరిత్రలో నిలిచిందన్నారు. పాపన్న వీరత్వానికి గుర్తుగా లండన్ మ్యూజియంలో విగ్రహాన్ని పొందుపరచారని గౌడ్ సంఘం నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పల్లెల సురేష్, కాటారపు సత్యనారాయణ, పానగల్ల శ్రీనివాస్, పల్లెల వెంకన్న, పల్లెల భిక్షం, గడ్డం సత్యనారాయణ, పుల్లారావు, మోహన్‌రావు, మణికంఠ, సామాజిక కార్యకర్త మైసాక్షి, వెంకటాచారి పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలి : సిపిఐ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

బోడిగూడెం ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజీ నిర్మించాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలో బోడిగూడెం, మంగపతిదేవిపేట గ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయన్నారు. ఆ గోతుల్లో నీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ రహదారి పక్కన డ్రెయినేజీ నిర్మిస్తే రోడ్డుపై నీరు నిలవకుండా ఉంటుందని చెప్పారు. బోడిగూడెం పంచాయతీ కార్యాలయం ఎదురుగానే రహదారిపై గుంతలు ఏర్పడి నీరు నిలిచిపోవడంతో గుంతలపై మట్టి వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారని, వాహనాల తాకిడికి బురదమయంగా తయారైందని, తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, నూతన రహదారి నిర్మించాలని, రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ చార్లెస్‌కు ఎంఎల్‌ఎ అభినందన

దెందులూరు :తెలుగు రాష్ట్ర ప్రజల సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసేందుకు తెలుగుదేశం ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2018లో స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా 15 మంది ఉపాధ్యాయులను అమెరికా పంపించారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్ర ప్రజల సంస్కృతులను అక్కడ ప్రజలకు తెలియజేసి ఐదేళ్లు పూర్తి చేసుకుని ఏలూరు చేరుకున్న డాక్టర్ చార్లెస్‌కు ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బడేటి చంటిని ఆయన క్యాంపు కార్యాలయంలో డాక్టర్ చార్లెస్ మర్యాదపూర్వకంగా కలిశారు. బడేటి చంటి డాక్టర్ చార్లెస్‌ను ఘనంగా సత్కరించారు.

20 నుంచి ఆధార్ కార్డుల నమోదు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపిడిఒ పద్మావతిదేవి తెలిపారు. దీనికోసం మూడు ఆధార్ మొబైల్ క్యాంపు యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా గుండుగొలను గ్రామ సచివాలయం కేంద్రంగా పనిచేసే మొబైల్ యూనిట్ ఈ నెల 20, 21 తేదీల్లో ఆగడాలలంక సచివాలయం కేంద్రంగా, 22, 23వ తేదీల్లో చెట్టున్నపాడు గ్రామ సచివాలయం కేంద్రంగా, ఈ నెల 24వ తేదీన గుండుగొలను గ్రామ సచివాలయం-3 కేంద్రంగా పనిచేస్తాయని తెలిపారు. పూళ్ల గ్రామ సచివాలయం కేంద్రంగా పనిచేసే మొబైల్ క్యాంపు యూనిట్ ఈ నెల 20, 21వ తేదీల్లో పూళ్ల గ్రామ సచివాలయం-1 కేంద్రంగా, 22, 23వ తేదీల్లో పూళ్ల గ్రామ సచివాలయం-3 కేంద్రాలుగా పని చేస్తాయన్నారు. ఈ నెల 24వ తేదీన అంబరుపేట గ్రామ సచివాలయం కేంద్రంగా అందుబాటులో ఉంటాయన్నారు. భీమడోలు గ్రామ సచివాలయం మొబైల్ క్యాంపు యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21వ తేదీల్లో భీమడోలు గ్రామ సచివాలయం-1 కేంద్రంగా, ఈనెల 22, 23వ తేదీల్లో సూరప్పగూడెం గ్రామ సచివాలయం కేంద్రంగా, 24వ తేదీన పొలసానిపల్లి గ్రామ సచివాలయం కేంద్రంగా పని చేస్తాయన్నారు. ఈ విషయమై విస్తృతస్థాయి ప్రచారం చేయాలని బాధ్యులను ఎంపిడిఒ కోరారు. సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మహాయోధుడు సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 79వ వర్ధంతి కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కమిటీ సభ్యులు కొమ్ము ఆనందం మాట్లాడుతూ భారత దేశ స్వేచ్ఛ స్వతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసి తన ప్రాణాన్ని పణంగా పెట్టిన ధీరుడు, మహా యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మనం పయనించటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని యువకులకు, మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఏలూరు జిల్లా సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో మెగాస్టార్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ బడేటి చంటి రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సేవాదృక్పథాన్ని అభిమానులంతా గర్వించే స్థాయికి తీసుకెళ్లిన ఘనత మెగాస్టార్ చిరంజీవికే దక్కుతుందన్నారు. చిరంజీవి ఆశయాన్ని ఆయన సోదరుడు పవన్‌కళ్యాణ్ ఆచరణలో పెట్టి రాజకీయంగా ఉన్నత శిఖరాన్ని అధిరోహించడం ఎంతో ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నారా శేషుతో పాటు మరికొంతమంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ అభిమానులు శానం రామకృష్ణ, మూర్తి, పి.జగన్, పి.సురేష్, లాయర్ సురేష్ పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్తతో అవస్థలు

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు గ్రామంలో శ్మశానవాటిక వద్ద చెత్త పేరుకుపోయి ఉంది. దీనికి సమీపంలో ఉన్నత పాఠశాల ఉండడంతో విద్యార్థులు ఈ దారి వెంటే నిత్యం ప్రయాణిస్తున్నారు. ఈ చెత్త నుంచి దుర్వాసన రావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా చెత్త రోడు మీదకు రావడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. దహన సంస్కారాలకు వచ్చే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదే దారి వెంబడి ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలు, ప్రజా సంఘాల భవనం, ఎస్‌బిఐ బ్యాంకులు ఉన్నాయి. చెత్త సేకరణ వాహనాలు చెత్తను సేకరించకపోవడంతో ఈ సమస్య వస్తుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిస్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

PUBLIC NOTICE

Under the instructions of my client M/s.Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep. by its Branch Manager it is stated that Smt.Koppula Vani, W/o.Koppula Ravi, 46 Yrs, House wife, R/o.Lingagudem village; Chinthalapudi Mandal, Eluru District, is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client with in 5 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

Tiled roofed house bearing H.No.5-30 (Assessment no.411) with a plinth area of 1040 Sq.feet and ACC sheet roofed Toilets with a plinth area of 50 Sq.feet along with its house site of an extent of 290.4 Sq.yards or 0.06 cents in R.S.No.137-1 present Sub-division R.S.No.137-1-A1; along with electricity service connection No.095 situated at Lingagudem village and Panchayath, Chinthalapudi Mandal, Eluru District bounded by :

East : Place of Thotakura Ravi
South : Place of Koppula Ravi
West : Place of Koppula Ravi
North : R&B Road

Kothagudem **P.Ganesh Babu**
Dt.18-08-2024 Advocate, Kothagudem

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.ఎస్.నెం.361/2020

వాదులు :
1) వెలగన ధనలక్ష్మి, 2) మేడిశెట్టి వెంకట రత్నం

ప్రతివాదులు :
1) మేడిశెట్టి సుబ్బారాయుడు
2) మేడిశెట్టి రంగారావు
3) వినుకొండ వెంకట బ్రహ్మాజి
4) వినుకొండ లీలా కుమారి
5) మేడిశెట్టి నాగ వెంకట రాజు
6) తిరుమల కళ్యాణి
7) మేడిశెట్టి జగన్మోహన్
8) కోటిపల్లి శింహాచలం

వాదుల తరపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన

పైనెంబరు దావాలో 5వ ప్రతివాదియైన మేడిశెట్టి నాగ వెంకటరాజుకి హాజరు నిమిత్తం పలుమార్లు కోర్టు ద్వారా దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున కోర్టు వారు పై నెంబరు దావాలో 5వ ప్రతివాది హాజరు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పైనెంబరు ది. **27-08-2024**వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు సదరు తేదీన పైనెంబరు దావాలో పై కోర్టువారి ఎదుట ఉదయం 10 గంటల నుండి హాజరు కాగలందలకు మరియు మీయొక్క ఆక్షేపణలు తెల్పుకొనవలసినదిగా యీ పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది. అట్లు మీరు హాజరుకాని యెడల మీ పరోక్షమందు దావా తీర్మానం కాబడగలదని యిందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా తేది : 27-08-2024

చిత్తగించవలెను
వాదుల తరపున అడ్వకేట్
భీమవరం, **పి. నరశింహాం,** బి.ఎస్సీ, బి.యల్.,
తేది.10-08-2024 అడ్వకేట్ భీమవరం-2.

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఏ.నెం.573/2020 మరియు ఒ.ఎస్.నెం.361/2020

పిటీషనర్లు/వాదులు :
1) వెలగన ధనలక్ష్మి, 2) మేడిశెట్టి వెంకట రత్నం

రెస్పాండెంట్లు/ప్రతివాదులు :
1) మేడిశెట్టి సుబ్బారాయుడు
2) మేడిశెట్టి రంగారావు
3) వినుకొండ వెంకట బ్రహ్మాజి
4) వినుకొండ లీలా కుమారి
5) మేడిశెట్టి నాగ వెంకట రాజు
6) తిరుమల కళ్యాణి
7) మేడిశెట్టి జగన్మోహన్
8) కోటిపల్లి శింహాచలం

పిటీషనర్లు/వాదుల తరపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన

పైనెంబరు ఐ.ఎ.573/2020లో 5వ రెస్పాండెంట్/ప్రతివాదియైన మేడిశెట్టి నాగ వెంకటరాజుకి హాజరు నిమిత్తం పలుమార్లు కోర్టు ద్వారా ఐఎ నోటీసులు పంపించినను మీరు తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున కోర్టు వారు పై నెంబరు ఐఎలో 5వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పైనెంబరు ఐ.ఎ. ది. **27-08-2024**వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు సదరు తేదీన పైనెంబరు ఐ.ఎ.లో పై కోర్టువారి ఎదుట ఉదయం 10 గంటల నుండి హాజరు కాగలందలకు మరియు మీయొక్క ఆక్షేపణలు తెల్పుకొనవలసినదిగా యీ పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది. అట్లు మీరు హాజరుకాని యెడల మీ పరోక్షమందు ఐ.ఎ.573/2020 తీర్మానం కాబడగలదని యిందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా తేది : 27-08-2024

చిత్తగించవలెను
పిటీషనర్/వాదుల తరపున అడ్వకేట్
భీమవరం, **పి. నరశింహాం,** బి.ఎస్సీ, బి.యల్.,
తేది.10-08-2024 అడ్వకేట్ భీమవరం-2.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో
E.P.No 81/2012 in OS. No.281/2006

బిట్వీన్ :
మేడపాటి రామచంద్రారెడ్డి ...డిక్రీ హోల్డర్
Vs
మేకల తాతయ్యనాయుడు ...జడ్జిమెంట్ డేట్టార్టు

మేకల తాతయ్యనాయుడు, S/o.సూర్యనారాయణ రుస్తుంబాద్, H/o.నరసాపురం మండలం

పై నెంబరు EP గ్రంధములో జడ్జిమెంట్ డేటార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది 05-09-2024వ తేదీన ఉ.గం.10.30ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

Item No.1 : పశ్చిమ గోదావరి జిల్లా. నరసాపురం సబ్-రిజిష్ట్రారులో చేరిన నరసాపురం మండలం, నరసాపురం మున్సిపల్ లిమిట్‌లో గల 12వ వార్డులో గల 116,173 చ.గ. స్థలము అందులోగల డోర్. నెం. 6-3-14 గల ఆర్.సి.సి. బిల్డింగ్‌లో గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తుగల భవనమునకు హద్దులు.
తూర్పు : జాయింటు మార్గము
పడమర : జే.చిట్టమ్మ మరియు ఇతరులు
దక్షిణము: ఆరేటి గోవిందరావు
ఉత్తరం : మానేం చిట్టెమ్మ గారి స్థలము.

Item No.2 : పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం సబ్-రిజిస్ట్రారులో చేరిన నరసాపురం మండలం, నరసాపురం మున్సిపల్ లిమిట్ లో గల 7వ వార్డులో గల 232 చ.గ. స్థలమునకు హద్దులు.
తూర్పు : సరిపల్లి రామకృష్ణారావు గారి స్థలము
పడమర : పట్నాల జగన్నాధం
దక్షిణము: రోడ్డు
ఉత్తరం : మేకల సీతామహాలక్ష్మి గారి స్థలం

అమీనా విలువ Item No.1 Rs.5,30,000/-
Item No.2 Rs.4,64,000/-
DHR విలువ (Item No.1 మరియు Item No.2) Rs.5.30.000/-

1వ ప్రతి లోని 116, 173 చ.గ. స్థలంలోని బిల్డింగ్ లో గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు దాని డోరు నెం 6-3-14 గృహోపకరణములు మరియు విద్యుత్ గృహోపకరణములతో సహా మరియు రెండవ ప్రతిలోని నరసాపురం 7వ వార్డులో 232 చ.గ. స్థలంతో సహా వేలం ద్వారా విక్రయించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పాలకొల్లు **యం.వెంకట రామిరెడ్డి**
తేది. 17-8-2024 అడ్వకేటు

కనిపించడం లేదు

పైడుమళ్ల ఈశ్వరి
వయస్సు 28 నుండి 30 సం॥లు

ది. 15-4-2024వ తేదీ నుండి వీరిద్దరు కనిపించడంలేదు. ఎవరికైన కనిపించినచో ఈక్రింది అడ్రసుకు సమాచారం తెలియజేయగలరు. ఆచూకీ తెలిపిన వారికి, తగిన పారితోషకం ఇవ్వబడును.

పైడుమళ్ల మణికంఠ
వయస్సు 5 సం॥లు

వెంకటరెడ్డి, యర్రగుంటపల్లి గ్రామం, చింతలపూడి మండలం
ఏలూరు జిల్లా, సెల్: 9494903194